కథానిక

# అదృష్టవంతుడు

జెస్సీ చాలా అలిసిపోయాడు. అతడు ఆగదిలో కూర్చుని టాంబ్రాక్సీకోసం ఎదురుచూస్తున్నాడు; అతడి పుండ్లుపడ్డకాళ్ళకి కాస్త విశ్రాంతి నిస్తూ, అంతేగాదు, చాలా ఆదుర్దాగా సంతోషంగూడా కలిసివుందేమో ఆ నిరీక్షణలో, ఆ నిమిషంకోసం... "ఏం పర్వాలేదు జెస్సీ, నువ్విప్పుడు సిద్ధమైతే ఆ క్షణాన్నే పని ప్రారంభించవచ్చు" అని టాం అనే నిమిషంకోసం.

రెండు దీర్ఘవారాలపాటు, తనను తాను, ఒకరకం ఆశయంకోసం, ఆశ్రయంకోసం, నెట్టుకుంటూ వచ్చాడు-కెన్సాస్ నగరంనుంచీ, ట్యూల్సావరకు-నడిచి! ఎటువంటిభయంకరమైన ప్రయాణం అది! సరైన నిద్రలేకుండా, ఒక మంచిభోజనంలేకుండా! ఎడతెరిపిలేని జల్లు పడుతున్న ఆ ముదనష్టపు వాతావరణంలో, మసక మసక ఎండలో కాళ్లు [illegible] బడేటట్టు నడిచి వచ్చాడతను. ఇంతా ఎందుకు? ఆ ఒక్క నిమిషంకోసం! అప్పుడే టాం ఆఫీసులోకి వచ్చాడు. చేతిలో ఒక కట్ట కాయితాలతో తొందరతొందరగా లోపలికి వచ్చాడతను. నిర్లక్ష్యంగా అతడు జెస్సీవేపు ఒకచూపు విసిరాడు. అతడికి ఇతనెవరో గుర్తేనా తగల్లేదు. వాస్తవానికి వాళ్ళిద్దరూ బావా-బావమరుదులు!

ఆవేనా అతని దుస్తులు? జెస్సీకైనా తెలుసు, తన దుస్తుల ఘోరస్థితి. అతడు వాటిని కాస్త బాగు చేద్దామని ఒక పార్కులోని పైపుదగ్గిర కాస్త ప్రయత్నించాడు కాని, అవి నీటిలోతడవగానే మరింత వికారంగా తయారైనాయి. అదే హడావుడిలో అతను క్షవరంచేసుకోబోతూ గడ్డం కోసుకున్నాడు. ఆగాయం, బుగ్గమీద అవుపిస్తూ వుంది. దుస్తులు ఎర్రదుమ్ము కొట్టుకుని అసహ్యముగా వున్నమాట నిజమే; లేక తను నిజంగానే యిదివరకంటే గుర్తుపట్టలేనంతగా మారిపోయినాడా?

యథార్థానికి వాళ్లిద్దరూ ఒకర్నొకరు చూసుకొని ఐదేళ్ళవుతోంది. టాం ఐదేళ్ళు పెరిగినట్టు అగుపిస్తున్నాడు. అయినా ఆనాటి అదే వ్యక్తి. అంతకన్నా అతనిలో ఏమీ మార్పులేదు.

టాంబ్రాక్సీ తన టెలిఫోన్ సంభాషణను ముగించాడు. తదుపరి తన కుర్చీలో ఆనుకుని కూర్చుని జెస్సీవంక తన చిన్న నీలపు కళ్ళతో, ఒకసారి చూశాడు. ఆ చూపులో ఏదో అనుమానం, అసహానం మిళితమై ఉన్నాయి.

టాం కొంచెం లావుగా, నెరిసీనెరవని జుట్టుతో, నలభై, నలభైఅయిదుఏళ్ళ వయసులో ఉంటాడు. అతని మొహం కొంచెం ముద్దగా, మందకొడిగా వుంటుంది. ఇతరత్రా అతడు చక్కని నిదానస్థుడైన, లఘువుబిగువులు తెలిసిన వ్యాపారస్తుడు-అదేవూళ్ళో అమెరికన్ లీజియన్ కంపెనీ బ్రాంచి మానేజరుగా వుంటున్నాడు.

అతడి ప్రస్తుత వైఖరి, జెస్సీకోసం కొద్ది నిమిషాలయినా వెచ్చించటం వృథాఅన్నట్టుగావుంది. అతను నిర్లక్ష్యంగా జేబునుంచి పళ్లు గుచ్చుకునే చిన్న తీగని తీసుకుని అతి కర్మశ్రద్ధగా ఆ పనిలో నిమగ్నుడైనాడు. ఒక నిమిషానికి ఏమనుకున్నాడో ఏమో, "ఆ...! మంచిది, నీకేం కావాలి?" అని ప్రశ్నించాడు, జెస్సీవంక చూడకుండానే. అతనిస్వరం చాలా తౌక్యంగావుంది, తొందరను సూచిస్తోంది కూడాను.

జెస్సీ ఇంతకన్న గొప్ప ఆహ్వానాన్ని ఎదురుచూడలేదు గూడాను. అతను తన బావమరదికీ తనకీ మధ్య అడ్డంగావున్న కౌంటర్‌ను ఆనుకుని నుల్చుని. చిందరవందరగావున్న క్రాపును సద్దుకుంటూ, "నువ్వు నన్నింకా గుర్తుపట్టలేదనుకుంటాను టాం? నేను-నేను, జెస్సీ ఫెల్టన్‌ని..." అన్నాడు.

మూలం : ఆల్‌బర్టు మాల్ట్స్ అనుసరణ : 'శారద'

"హుం!" అని మాత్రం అన్నాడు టాం బ్రాక్లీ.

"అవును... మా చెల్లెలు ఎల్లా నీతో చెప్పమంది తన ప్రేమానుభూతులను."

బ్రాక్లీ కౌంటర్ ఆ చివరవింది నడిచి, తన బావగారి ఎదుటకు వచ్చి నిలబడ్డాడు. అతని ప్రయత్నం తను ఐదేళ్ళ క్రితం చూసిన తన బావమరది ఇతడేఅని నిర్థారించుకోడానికా అన్నట్లు. జెస్సీ షెల్టన్‌ను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూడసాగాడు, ఈ వ్యక్తి పొడుగ్గా, ముప్పైఫ ఏళ్లు దాటినట్టు కనబడుతున్నాడు అది సరిపోయింది. అవును, అతడు పొడుగ్గా, చక్కగా అమరికగా వుండేవాడే. అదీ సరిపోయినట్టే. కాని ముఖం మాత్రం చాలా ముదురుగా అగుపిస్తోంది! ఆ వెధవ దుస్తులు-అతనికేమాత్రం తగవు... అతని బావమరది పుష్టిగా బలంగా, వున్న యువకుడు...! ఇది ఎట్లావుందంటే చెడిపోయి చెరిగిపోయిన ఒక ఫొటోగ్రాఫ్‌లో... దాని అసలు రూపాన్ని ఊహించటానికి ప్రయత్నించినట్టుగావుంది. పోలికలు సరిపోయిన మాట నిజమేగాని, వ్యత్యాసం విపరీతంగా వుంది. అతని కళ్ళల్లోకి చూశాడు చివరికి. అవి బాగా యెరిగున్న కళ్ళే, కొంచెం తేనె రంగుగా, ఆదుర్దాగా కనుపించే ఆ కళ్ళే టాంకి నచ్చినాయి.

జెస్సీ నిదానంగా నుంచున్నాడు. లోపల మాత్రం చాలా ఆదుర్దాగా వున్నాడు అతను. బ్రాక్లీ మాత్రం ఇంకా పరిశీలన మానలేదు. "నేను నిన్ను గుర్తుపట్టాను. కాని నువ్వు చాలా మారావు అన్నంతవరకు నిజం." అన్నాడు అతను చివరికి.

"అవును! ఈ లోగా ఐదేళ్ళు గడిచిపోయినాయి మరి! కాదూ?" అన్నాడు జెస్సీ. మళ్ళీ అన్నాడు, "నువ్వయినా అప్పుడు రెండుసార్లు చూసావంతే" అంటూనే తనలో తను అనుకున్నాడు అవమానంతోనూ రోషంతోనూ "నేను ఏమంత మారానని? ఎవరైనా అంతేగదా? నేనేమైనా శవాన్నా?" అని.

"మొత్తంమీద నువ్వుచాలా బరువు తగ్గావు అనుకుంటా!" అన్నాడు టాం, తన వెనకటి ఆశ్చర్యం ఇంకాపోని గొంతుతో.

జెస్సీ మౌనంగా వూరుకున్నాడు. ఈ సంభాషణ అతనికి బాధకలిగిస్తోంది. ఇంకా ఎంతసేపు సాగుతుందో ఇట్లా?...

ఇంతలోనే టాం తెప్పరిల్లుకున్నట్టుగా క్షమార్పణ వేడుకుంటున్నట్టుగా, గొంతుమార్చి, "లోపలికి రావోయ్, రా, ఇదిగో ఈ కుర్చీలోకూర్చో. నిన్ను చూడ్డం ఎంతో సంతోషంగావుంది. మరేమీ అనుకోకు. నువ్వుచాలా సన్నబడ్డావు సుమా!" అన్నాడు ప్రేమగా, తన బావమరిది చెయ్యి వూపుతూ.

"మంచిది" జెస్సీ గొణిగాడు, కూర్చుంటూ తన వుంగరాలజుట్టు ఎడంచేత ఎగదువ్వుకుంటూ.

"కుంటుతున్నావు ఎందుకయ్యా?" టాం అడిగాడు.

"ఏమీలేదు. ఒక కోసురాయిమీద కాలు తగిలింది. బూటు కన్నంపడింది. కాలికి తగిలింది కాస్త" అని పైకన్నాడుగాని అతను లోలోపల తనబూట్లు ఆ రెండువారాల ఎడతెరిపిలేని నడకకు అరిగి చిల్లులు పడ్డాయి అని చెప్పడానికి సిగ్గుపడ్డాడతను. ఇంకేమైనాసరే-తనకు ఒకజతబూట్లు ముఖ్యావసరం.

బ్రాక్లీ అతనివైపు చూసాడు. అతడి బాధేమిటో అర్థమైందతనికి. తను ఎరుగున్న వాళ్ళెవరూ ఇంత దుర్భరస్థితిలో ఉండగా చూచివుండలేదు తను...తన చెల్లెలు వారానికి ఓ ఉత్తరం రాస్తూనే వుందిగాని ఇంతఘోరంగా వుందాస్థితి? ఆ వుత్తరాల్లో అవేమీలేవు! "అదిసరేగాని, జెస్సీ! పరిస్థితులేమిటి? నాచెల్లెలు ఎల్లా ఎట్లావుంది?" అని ప్రశ్నించాడు.

"ఏమి? ఆమె కులాసాగానేవుంది!" అన్నాడు జెస్సీ పరధ్యానంగా. అతను తనువచ్చిన పనిని గురించి ఎట్లాసంభాషణ ప్రారభించటమా అని ఆలోచిస్తున్నాడు.

"పిల్లలు?" అన్నాడు టాం.

"వాళ్ళుబాగానే వున్నారు...చిన్నాడు పరగెత్తటం లేముగాని, బొమ్మలుగీస్తున్నాడు, ఏవో చిలిపిపనులుచేస్తూ వుంటాడు-నువ్వెరగవూ?...

"అవును..." ఒకనిమిషం గడిచాక అన్నాడు టాం. జెస్సీ అతనికుర్చీలో కూర్చోలేక పోతున్నాడు. ఆ నిమిషం అసన్నమైంది...టాం జెస్సీ

భుజంమీద చెయ్యివేసి "ఎల్లా, పరిస్థితులు ఇంత ఘోరస్థితిలో ఉన్నాయని రాయలేదుసుమా నాకు? నేను ఏదైనా సహాయం చేస్తాను తప్పకుండా!" అన్నాడు.

"మంచిదే. కాని నీ ఇబ్బందులు నీకున్నాయి కదా?" అన్నాడు జెస్సీ.

"అవును" అంటూ కుర్చీకి ఆనుకుని కూర్చున్నాడు టాంబ్రాక్లీ! అతని ఎర్రని ముఖంలో విషాదచ్ఛాయలు ఆవరించినాయి. "నా ఇనప సామాన్లకొట్టు పోయింది-నీకు తెలుసుకదూ?" అన్నాడు.

"అవును. నువ్వుమాకు వ్రాశావు కూడాను. అదే నేనన్నది" అన్నాడు బావమరిది.

"నే మరిచిపోయినానులే. అదొక గొడవలే. మూడేళ్లు నష్టంమీద నడిచింది వ్యాపారం. చివరికి మునిగిపోయింది. నాసోదికేంలేగాని, నీసంగతేదో చెప్పు" అంటూ నవ్వాడు కొంచెం విరక్తిగా-టాం; "నీ వుద్యోగం ఏమైందేమిటి?" అని కనుక్కున్నాడు.

"అదొక విశేషం; నామనస్సులో ఇంకోసంగతి వుంది."...గొణిగాడు జెస్సీ ఆదుర్దాగా.

"అదేమీ 'ఎల్లా' గురించి కాదుకదా?" టాం ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"ఆమె సంగతేమీ లేదులే. ఆమెకేం బాగానే వుంది." జెస్సీ హృదయపూర్వకంగా నవ్వాడు. "నా జీవితమే ఆమె! టాం!"

"క్షమించు జెస్సీ. మరిచిపోయినాను" బ్రాక్లీ ఒకసారి దగ్గాడు ఫీలవుతూ. ఆ యువకుడు నగ్నంగా వుదహరించిన ప్రేమ అతన్ని ఒకరకంగా; బాధపెట్టింది ఆ భావం వాళ్ళకు తనేదో చేతయిందని చేసితీరాలనే ఔత్సుక్యాన్ని అతనిలో పెంచింది. ప్రస్తుతం వాళ్ళపరిస్థితి నిజంగా చాలా కష్టంగావుండి వుండాలి. తన బావమరిదికిమల్లేనే తనచెల్లెలుగూడా అందంగా, సన్నగావుంటుంది"

"టాం! విను. నేను ఒకపనిమీద ఇక్కడికి వచ్చాను. నువ్వునాకు సహాయం చెయ్యాలి!" అన్నాడు జెస్సీ.

"చా! చా! నువ్వుఇట్లా అడగ్గలవని ఎదురు చూస్తున్నానులే. అయినా నాదగ్గిర ఎక్కువేమీ లేదు. నాకైనా వారానికి వచ్చేది 35 డాలర్ మాత్రమే. దానికే నేనెంతో సంతోషపడుతున్నాననుకో" అన్నాడు టాం విరక్తిగా.

"అవును. నాకుతెలుసు" అన్నాడు జెస్సీ. అతను ఆ పొద్దుట్నించీ దేనికోసం ఎదురు చూస్తున్నాడో ఆ క్షణం ఇదే: "నువ్వు డబ్బుతో మాకేమీ సాయపడలేవని నాకుతెలుసు. కాని... నేను ఒకతన్ని కలుసుకున్నాను మావూళ్ళో. అతను నీదగ్గిర పనిచేస్తున్నానని చెప్పాడు. నీ దగ్గిర నాకివ్వటానికి ఉద్యోగం వుందనిగూడా చెప్పాడు"

"ఎవరాచెప్పింది?"

"నువ్వెందుకు నాతో చెప్పలేదు? అతను నాతో అన్నాడు ఆ సంగతి. వెంటనే బయల్దేరి రెండువారాలు చెప్పరాని అవస్థలుపడి ఇక్కడికి చేరుకున్నాను" అన్నాడు జెస్సీ.

"బావుంది! నువ్వు కెన్సాస్ నగరంనించి రెండు వారాలుగా నడిచివచ్చావని నేను నీకు ఉద్యోగం ఇచ్చేదా?" అన్నాడు టాం బిగ్గరగా అదో మాదిరిగా. "తప్పకుండా టాం! అంతకన్న నేను చేయగలిగిందిమాత్రం ఏముంది?" జెస్సీ జాలిగా అన్నాడు.

"ఓరి దేవుడా! ఇక్కడ ఉద్యోగాలేమీ లేవు జెస్సీ! ఇది వెధవ సీజను. పైగా ఈ ఆయిల్ బిజినెస్ గురించి నీకు బాగా తెలీదు. అదో రకంలే. నాకు తెలిసిన స్నేహితులు పెద్ద హోదావాళ్ళే వున్నారనుకో. కాని ఇప్పుడు వాళ్ళేమీ చెయ్యలేరు. ఏదైనా ఛాన్సే వుంటే నిన్ను పిలవననుకుంటున్నావా నువ్వు?"

జెస్సీ ఉలికిపడ్డాడు. ఈ రెండు వారాల మహోన్నతమైన ఆశా - బాధా - పర్యవసానపు నిరాశతో అతని కడుపులో దేవసాగింది. అతను యేడుపు స్వరంలో "కాని విను టాం! ఆ వ్యక్తి చెప్పాడు నువ్వు పని ఇవ్వగలవని. అతను నీదగ్గిర లారీ తోలుతున్నాడట. నీకింకా మనుష్యులు కావాలట!" అన్నాడు.

"ఓ! నువ్వు అనటం, నా 'డిపార్టుమెంటు' సంగతా?" బ్రాక్లీ హీనస్వరంలో ప్రశ్నించాడు.

"అవును టాం! అదే అదే!"

"అయితే, నా డిపార్టుమెంటులో నువ్వు

పని చెయ్యటానికి వీల్లేదు. బ్రాక్కీ అదే హీన స్వరంలో అన్నాడు. "అదేమిటో నీకు తెలీదు."

"నేను తప్పకుండా పనికివస్తాను. అతను నాకన్నీ చెప్పాడులే. నువ్వు లారీలు 'డిస్పాచ్' చేస్తావుట. ఆ డైనమైట్ లారీలు బైటకు పంపే బాధ్యత నీదేనటగా?"

"ఎవడు నీకు ఇవన్నీ చెప్పింది జెస్సీ?"

"ఎవరెట్...అవును. ఎవరెట్! అనుకుంటా"

"ఎగ్బర్ట్ కాదూ? సరిగ్గా నా అంతే వుంటాడు. అవునా?" బ్రాక్కీ మెల్లిగా ప్రశించాడు.

"అవును ఎగ్బర్ట్!...అతడు అంత లావు గాదు అంతేనా?"

బ్రాక్కీ నవ్వాడు. "అవును. వాడు నా అంత లావుకాదులే" అతడీసారి హృదయపూర్వంగా నవ్వలేదు. "నువ్వు అన్ని వివరాలూ అడిగే ఇంతదూరం వచ్చావన్న మాట!"

"నాకు తెలుసు నువ్వు లేదు" అంటావని. అతను చెప్పాడులే, ఆ పని కొంచెం ప్రయాసతో కూడినదని. కాని ఫర్వాలేదు. నేను చేస్తాను" అన్నాడు జాస్సీ తనకేదో తెలిసినట్లే నటిస్తూ.

బ్రాక్కీ తన రెండు చేతివేళ్ళని పెనవేసి ఆలోచిస్తూ, "ఏమైనాసరే, లేదు ఒక్కటే నా సమాధానం" అన్నాడు.

జెస్సీ చిన్న పిల్లవాడిలా ఏడవసాగాడు. అట్లా కాకపోతే టాం గుండె కరగదు. అతను ట్యుస్లా కొచ్చింది ఇందుకోసమేనా? "టాం టాం! అది నీవల్ల కాకపోతే వేరే పనులేమీ లేవా?" జాలితోకూడిన వెక్కిళ్ళ మధ్య అడిగాడు జెస్సీ.

"ఓ! పనులకేం? వుద్యోగాలున్నాయి. నువ్వు కావాలంటే, ఎగ్బర్ట్ వుద్యోగమే వుందికూడా"

"అతను కులాసాగా వున్నాడా?"

"చనిపోయాడు!"

"ఓ!"

"వుద్యోగంలో వుండగానే జెస్సీ! గత రాత్రే ఆతను చనిపోయింది కూడాను!"

"ఓ! అదా? అయినా నాకేం ఫర్వాలేదు."

"నే చెప్పేది సరిగ్గా విను. నువ్వు యేదైనా చెప్పక ముందే, నేను కొన్ని విషయాలు నీకు చెప్తాను. నువ్వు తోలే లారీలు డైనమైట్లు కావోయ్ మహానుభావా! వాళ్ళెప్పుడూ డైనమైట్లు వంటి భయంకరమైన పదార్థాన్ని ఉపయోగించరు. నూనె బావులు త్రవ్వటానికి. వాళ్లు ఇష్టపడితే చెయ్యవచ్చు. కాని చెయ్యరు! అది నైట్రోగ్లిసరిన్-సూప్!"

"కాని...నాకు తెలుసు. అతను నాకు అన్నీ చెప్పాడు."

"నోరు మూసుకో ఒక నిమిషం, ఇటు విను" కోపంతో అంటూ టాం వివరింపసాగారు. నైట్రోగ్లిసరిన్ ద్రవం అంటే ఏమిటో నీకు తెలుసా? నువ్వు గట్టిగా దగ్గితే చాలు అది కాస్తా పేలి వూరుకుంటుంది! వాళ్ళు దాన్ని ఎలా పంపుతారో నీకు తెలుసా? గుండ్రటి గొట్టాల్లో (చెయ్యి బంతి ఆకారంగా చూపిస్తూ) పంపిస్తారు. అవన్నీ రబ్బర్ పాకింగ్లో అమర్చబడతాయి. అదొక్కటే మార్గం వాటిని నువ్వు తీసుకెళ్ళటానికి."

"విను టాం..."

"ఒక్క నిమిషం ఆగు జెస్సీ. నీ పుణ్యానికి ఒక్క నిమిషం నే చెప్పేది అర్థంచేసుకో. నాకు తెలుసు, నువ్వు వుద్యోగంకోసం తహతహ లాడుతున్నావని... నే చెప్పిన ఈ పదార్థం, ప్రత్యేకమైన ట్రక్కులలోనే వెళ్తుంది. రాత్రిపూటల్లోనే సుమా! అంతేకాదు! ప్రత్యేకంగా నిర్మించిన రోడ్డుమీద ఏ పట్నాలగుండానూ వెళ్ళదు. ఒకవేళ ఎక్కడైనా లారీలను ఉంచవలసివస్తే ప్రత్యేకమైన షెడ్డులలో ఉంచుతారు. ఇదంతా ఎందుకని నీ ఉద్దేశం? నీకు తెలియటం లేదా అదెంత అపాయమో?"

"నేను చాలా నిదానంగా తోలుతాను... నాకు తెలుసు లారీలు ఎట్లా తోలాల్సిందీ!"

"నీ వుద్దేశం, ఎగ్బర్ట్ నిదానంగా తోలడనా లేక ఒక లారీని ఎట్లా తోలాలో వాడికి తెలీదనా?" టాం హేళనగా అన్నాడు.

జెస్సీ తొందరగా "నువ్వు నాకు వేరే ఏమి చెప్పినా నా తలకెక్కదు. నా ఆశ,అంతా ఒక్క విషయంమీద కేంద్రీకరించి వుంది. ఎగ్బర్ట్ మైలుకి ఒక డాలర్ సంపాదిస్తున్నానని చెప్పాడు 15 రోజుల పనికే-ఒక నెలలో 600 వందల

డాలర్ల దాకా సంపాదించాడట! నిజమేనా టాం? నాకైనా అంత ఇస్తారు కదా?" అని ప్రశ్నించాడు.

"తప్పకుండా ఇస్తారు నీకు కూడా!" అర్థస్ఫూర్తిగా అన్నాడు టాం. "అవును, ఒక మైలుకి డాలరు! నిజమే. కాని కంపెనీవాళ్ళు అంత ఖర్చు ఎందుకు పెడుతున్నారో నువ్వెందుకు ఆలోచించవు?...ఎందుకో ఊహించటం సులభమే.. ఎగ్‌బర్ట్ చేసినట్టు... ఏదో రాయి మీదగా నీ లారీని పోనిస్తావు. నీ లారీ ముందు లైట్లకి అవి కనపడకపోవచ్చు. అంతే లారీ కాస్తా పేలి పూరుకుంటుంది; లేక నీ కళ్ళలో నలక పడుతుంది. అదితుడుచుకునే ప్రయత్నంలో లారీ ఒక్క రవ్వ పక్కకి వొరగవచ్చు ..లేనా ఇంకేదో అవాంతరం, అతి స్వల్పమైన అవాంతరం అదేదో భగవంతుడికే తెలియాలి వాటి కారణాలు. మేము ఎగ్‌బర్ట్‌కే జరిగిందో వాణ్ణి అడగగలిగామా? ఏదైనా ఆధారం తెలుసుకుందామా అంటే అక్కడ లారీలేదు. శవమూలేదు. అక్కడ అసలేమీ లేదు. ఒకవేళ రేపు ఎవరైనా, వెతికితే పొలాల్లో చిన్న చిన్న ఇనుప ముక్కలు దొరికితే దొరకవచ్చు. కాని, మనం ఎప్పటికి కూడా డ్రైవర్‌నిమాత్రం చూడలేం. ఒక్క చిన్న ఎముక కూడా దొరకదు! మాకు తెలిసిందల్లా ఇక అతను జవాబా లెక్కలోకి రాడనిమాత్రమే. ఇక మేము పోలీసులు ఎంక్వయరీ కెప్పుడు వస్తారని ఎదురుచూడటం వరకే చెయ్యగలిగేది. నిన్న రాత్రి ఏం జరిగిందో తెలుసా? ఏదో పొరపాటు, లారీ ఒక బ్రిడ్జిమీద పోతూవుండగా జరిగింది. ఎగ్‌బర్ట్ ఉషారుగా వుండివుంటాడు బహుశా. బహుశా లారీ బ్రిడ్జిపక్క ఫెన్సింగుకు రాసుకుని వుంటుంది. అంతే! ఆ తర్వాత అక్కడ బ్రిడ్జి లేదు. లారీ లేదు. ఎగ్‌బర్ట్ లేడు. అంతా ధూళిగా మారిపోయివుంటుంది. నీ కిప్పుడైనా అర్థమైందా? అదీ-ఆ వెధవ డాలరుకి వచ్చే ప్రతిఫలం!"

ఒక నిమిషం మౌనం ఆవరించింది గదిని. జెస్సీ తన సన్నని పొడుగాటి చేతుల్తో బల్లమీద తాళం వేస్తూ కూర్చున్నాడు ఒక క్షణం. అతని మొహంలో ఏవో ఆలోచనరేఖలు అగుపిస్తున్నై.

అతను కళ్ళు మూసుకుని నిదానంగా అన్నాడు "నేను దేనికోసం భయపడ్డం లేదు బావా! నువ్వేమన్నావు? నాకు సహాయం చేస్తానన్నావా లేదా? ఈ వుద్యోగం నాకివ్వు-మరేం ఫర్వాలేదు."

బ్రాక్ తన చేతుల్ని బల్లమీద గట్టిగా అదిమిపట్టి "వీల్లేదు" అన్నాడు. జెస్సీ జాలిగా, "విను టాం!" అన్నాడు. అతని కళ్ళు నీళ్ళతో నిండివున్నాయి.

ఆ కన్నీళ్లు టాం మనసును కలచివేస్తున్నాయి. అతను మౌనంగా వినసాగాడు. "నావంక చూడు టాం! వాదుస్తులు చెప్పటంలేదా నాస్థితినిగురించి? నన్ను ఇందాక చూసినప్పుడు ఏమనుకున్నావు? ఏమిటి ఇట్లావున్నాడు - ఇంతఘోరంగా అని-కాదా? ఈ స్థితిలో నే ఇక ఒక్కక్షణమైనా వుండలేను టాం! నేనూ తలెత్తుకుని బజార్న నడవవద్దా?-ఆలోచించు!" అన్నాడు.

"హుం! సగటున ప్రతిసంవత్సరం ఐదుగురు డ్రైవర్లకి ఒకడుచొప్పున చచ్చిపోతున్నారు. ఏమిటి లాభం ఈ వుద్యోగంవల్ల? చెప్పు." టాం బరువుగా అన్నాడు.

"అయితే కావచ్చు. కాని ఇప్పుడు నాజీవితం ఇప్పుడు ఏం విలువ చేస్తున్నదంటావు? ఇంటి దగ్గిర భార్యాపిల్లలూ నేనూ ఆకలితో మాడిపోతున్నాము. ఇంతకన్న బాధ వేరేవుందంటావా?"

"అదంతా ఈవరకే చెప్పావుగా?...అది నిజంగా నీతప్పే. తనఇంట్లో అందరూ మలమల మాడుతూవుంటే నోరుమూసుకుని వాటిని భరించటం-లేనిగొప్పతనాన్ని ప్రదర్శించటంమాత్రమే. నేను కొంతపైకం ఇస్తాను. వెంటనే దాన్ని ఎల్లాకి మనియార్డరు చెయ్యి. తర్వాత నువ్వు ఇంటికి వెళ్లు. విశ్రాంతిగా కూచుని ఆలోచించు."

"ఆ తర్వాత ఏమిటి?"

"నా మొహం. ఆ తర్వాత ప్రశ్న తర్వాత. కొంతకాలం వేచిచూడు. నువ్వేమీ ముసలివాడవు కాదు. నీ ప్రాణాన్ని ఇటువంటి ప్రమాదంలో బలివ్వటానికి నీకేమీ హక్కు లేదు కూడాను. కొన్నాళ్ళకి నీకు మంచివుద్యోగం దొరకపోదు."

"లేదు!" జెస్సీ ఒక్కగంతేసి లేచినుల్చున్నాడు.

"కొంత కాలం క్రితం నేనూ ఆ నమ్మకంతోనే జీవించాను. ఇప్పుడా నమ్మకం లేదు;

"నీ కాస్త ధైర్యం ఓపిక అవసరం అనుకుంటా."

"నాకు కావాల్సినంత ధైర్యం వుండనే వుంది. ఓపిక అంటావా! ఆరేళ్లు...ఓపిక పట్టి పట్టి—నా గుండె నీరసించింది."

"ఎంత చెప్పినా వినవేం? కనీసం నీ భార్యనైనా ఒక నిమిషం తల్చుకో"

"ఇప్పుడు నేను ఆమెను గురించి తలవటం లేదనా నీ ఉద్దేశం! ఆమెని పస్తు పడుకోపెడ్తూ నేను ఆమెని ఎంత ప్రేమించి ఏం ప్రయోజనం? ఎగ్మెర్టు మా యింటికి వచ్చిన రోజున ఆమె కేర్పడిన ఉత్సాహంతోనే నేనింత దూరం నడిచి రాగలిగాను."

టాం బ్రాక్లీ ఆలోచిస్తూ కూర్చున్నాడు.

జెస్సీ ప్రారంభించాడు. "నువ్వు దయదల్చాలి. నీ చెల్లెళ్ళ గురించి ఆలోచించు! ఆమెకు రెండు పూట్లయినా అన్నం పెట్టాలిగదా? రెండో పిల్లాడికి అవిటి కాలు నయం చేయించాలి. చిన్న పిల్లాడికి పిప్పరమెంట్లు కొని పెట్టాలి, వాళ్లని సినిమాలకి కూడా తీసుకెళ్లాలి... నాకో జత బూట్లు ఒక సూటు కొనుక్కోవాలి. మైలుకి ఒక డాలర్ అంటే నెలకి అయిదు వందల డాలర్లు దాదాపు నా ఖర్చులు పోను, ఎంతో మిగులుతుంది. నేను రెండు నెలలే బ్రతికి వుంటాననుకో-వాళ్లకి కొద్దో గొప్పో మిగిల్చిపోతాను. అదృష్టం వుంటే ఇంకో ఏడాది బ్రతికి వుంటానేమో! టాం! టాం! నాకీ ఉద్యోగం ఇప్పించాలి నువ్వు తప్పదు!"

"నీవనుకోవటం ఈ ఉద్యోగంలో చేరగానే చాలా సంతృప్తుడై వుంటావనా? అది వట్టి పిచ్చిమాట! ప్రతి నిమిషం-ఉద్యోగంలో వున్నా లేకపోయినా, ఏనిమిషాన ట్రక్కు పేలిపోతుందో అని ఎదురుచూస్తూ నిరంతర భయంకర జీవితం గడపాల్సి వుంటుంది. అంతకన్న నరకం నయం."

"కావచ్చు. కాని, ఈ నిరుద్యోగ నరకం కంటే, తొడుక్కోడానికి గుడ్డలు లేక పడే చలిబాధ కంటే, "ఉద్యోగం లేదు" అనే ఈ మానసిక నరకబాధ కంటే భయంకర జీవితం వేరే వుందా టాం? నేను నిశ్చయం చేసుకున్నాను."

"అయితే ఈ రాత్రికో నువ్వు ఉద్యోగంలో చేరు..." టాం గద్గదంగా అంటూ, విరక్తిగా కోపంగా, "ఇదిగో ఈ చిల్లర డబ్బులు తీసుకుని పోయి భోజనం చేసి సాయంత్రానికి కిక్కడికి రా. పో..."

"థ్యాంక్యూ" అంటూ జెస్సీ బయిటకి నడిచాడు. ఆ నిముషాన ప్రపంచంలో అతనికంటే కులాసా వ్యక్తి మరెవరూ లేనట్టే భావించాడతను. ఈల వేసుకుంటూ బయటికి వెళ్ళిపోయినాడు.

ట్రాం బాక్లీ కళ్ళల్లో నీళ్లు తిరిగినయ్. అతను నిస్పృహాయుడై, రెండు చేతుల్తోనూ తల గట్టిగా అదిమి పట్టుకుని టేబిల్ మీద పడిపోయినాడు.

---

క థా ని క

# తెరవెనుక

"గోపీ"

ఏ పెట్టెలో ఎక్కడమా? — అన్న ప్రశ్న.

దూరపు ప్రయాణం, ఆలశ్యంగా వచ్చిన కంగారు, రిజర్వేషన్ దొరదలేదే అన్న విచారం. పాము నోట్లోకి పోతూన్న కప్పు మిడతకోసం నాలిక చాచుతుంది...ఎక్కబోయే పెట్టెలో 'యమలోకం' కనబడుతూనే వున్నా, అందమైన అమ్మాయి ఎక్కే పెట్టెకోసం ప్రాకులాడుతాం. అందులో ఏదో మజా ఉందనుకుంటాం.

సన్నని నడుము, నీలి జార్జెట్ చీర, చెప్పులు, గాలిలో తేలిపోతూన్నట్లు జనసమ్మర్ధాన్ని తోసుకుపోతూన్న అమ్మాయి, నా ఆలోచనలకి ఒక స్థిరరూపం ఇచ్చింది. నాలుగు అడుగులు వేశానో లేదో, అరవై మైళ్ల వేగంలో పోతూన్న కారుకి అమాంతంగా బ్రేకు పడ్డట్టయింది.

"ఇదే పెట్టె, సామాన్లని పిల్లల్ని త్వరగా తీసుకురా" అని బంట్రోతుని ఆజ్ఞాపించింది